# ఇండోర్ గేమ్ !



"మధూ... నాకు ఓ మరదలు ఉందన్న విషయం నీకు తెలుసు కదూ?!"

ఆశ్చర్యంగా కృష్ణవైపు చూశాడు మధు.

ఆఫీసు విషయాలు, స్నేహితుల విషయాలు మాట్లాడుకుంటూంటే మధ్యలో అతని మరదలి ప్రస్తావన ఎందుకు తెచ్చాడో మధుకు అర్థంకాలేదు.

మధు, కృష్ణ బాల్యమిత్రులు. ఒకే స్కూలులో, తర్వాత ఒకే కాలేజీలో కలసి చదివారు. కృష్ణకు హైదరాబాద్‌లోనే ఉద్యోగం వస్తే... మధుకు ఢిల్లీలో ఉద్యోగం వచ్చింది. ఆ రెండు ఊర్ల మధ్య దూరం వాళ్ళ స్నేహం తాలూకు దూరాన్ని పెంచలేదు. ఒకసారి మధు హైదరాబాద్ వస్తే మరోసారి కృష్ణ ఢిల్లీ వెళ్లేవాడు. ఇద్దరూ ఫోన్‌లో తరచుగా మాట్లాడుకునేవారు. పదేళ్ల తర్వాత మధు ఢిల్లీ వదలి హైదరాబాద్ వచ్చాడు కొత్త ఉద్యోగంలో చేరడానికి.

మధుకు ఢిల్లీలో ఉన్నప్పుడే పెళ్ళయింది. అయితే కాన్పు కష్టమై బిడ్డతో పాటు మరణించింది మధు భార్య. అప్పట్నుంచీ ఒంటరిగానే ఉంటున్నాడు మధు. కృష్ణ తన ఇంటికి దగ్గరగా ఓ చిన్న పోర్షన్‌ను మధు కోసం చూసిపెట్టాడు. ఆఫీసులో రిపోర్ట్ చేశాక వారంరోజులు బిజీగా గడచిపోయాయి మధుకి.

ఆరోజు ఆదివారం కావడంతో స్నేహితులిద్దరూ కలసి సిటీ అంతా తిరిగారు. పాతరోజుల్ని గుర్తుకుతెచ్చుకున్నారు. స్నేహితుల్ని తలచుకున్నారు. రాత్రి ఓ త్రీ-స్టార్ హోటల్‌లో ఫ్యామిలీ రూమ్‌లో డిన్నర్ తీసుకుంటున్నప్పుడు కృష్ణ తన మరదలి ప్రస్తావన తెచ్చి మధుని ఆశ్చర్యపరిచాడు.

"ఏమిటి మాట్లాడవు? 'నాకో మరదలు ఉందన్న విషయం నీకు తెలుసా?' అని అడుగుతున్నాను" కృష్ణ మళ్లీ అడిగాడు.

"తెలుసు. నీకు పెళ్ళి కుదిరాక నాతో 'నాకు అందమైన భార్యే కాదు, అందమైన మరదలు కూడా వస్తుంది!' అన్నావు."

కృష్ణ నవ్వి, "నీకు చాలా విషయాలు గుర్తుంటాయి. ఆరోజు తమాషాకు అలా అన్నాను గానీ, నా పెళ్ళయ్యాక ఆమెని నా స్వంత చెల్లెలిలా చూసుకున్నాను" అన్నాడు.

"ఆ విషయంలో నాకు ఎలాంటి అనుమానం లేదు. నీ సంస్కారం గురించి నాకు తెలియదా?"

"నాలుగేళ్ల క్రితం ఆ అమ్మాయికి ఓ ఛార్టెర్డ్ అకౌంటెంట్‌కిచ్చి పెళ్ళి చేశాను."

"ఆ విషయం నాతో చెప్పినట్టు గుర్తు!"

"అయితే పెళ్ళయిన ఏడాదిలోగా అతను చనిపోయాడు."

"మైగాడ్... ఎలా?"

"ఆత్మహత్య చేసుకుని!"

"ఎందుకు?"

"అదే తెలియదు. భరణికి కూడా తెలియదు. భరణి... అంటే నా మరదలు!"

"అర్థమైంది. ఈ విషయం నాతో ఎప్పుడూ చెప్పలేదు నువ్వు."

"నీ భార్య పోయిన బాధలో నువ్వున్నావు. నా బాధ కూడా నీకు పంచడం ఎందుకని చెప్పలేదు. భరణి ఆ షాక్ నుంచి త్వరగానే కోలుకుంది. పైచదువులు చదువుతానని ముంబయ్ వెళ్లింది. ఆరునెలల క్రితం హైదరాబాద్ తిరిగొచ్చింది. మా మామగారు, అత్తగారు ఆమె పెళ్ళికి ముందే గతించారు కనుక ప్రస్తుతం మాతోనే ఉంది."

"బాగా చదువుకుందంటున్నావు... ఉద్యోగం కోసం ప్రయత్నించలేదా?"

"అఫ్‌కోర్స్... ఆమె మంచి కంపెనీలో ఉద్యోగం చేస్తోంది."

'అయితే ఇంకేమిటి ప్రాబ్లమ్?' అన్నట్టు చూశాడు మధు.

"భరణికి ఎంతో జీవితం ముందుంది. ఆమె వయసు ఇరవై ఎనిమిదేళ్లే! అందుకే ఆమెకు మళ్లీ పెళ్ళి చేద్దామని నేనూ, శాంతి ఆలోచించాము. కానీ, భరణి ఒప్పుకోవడం లేదు. పెళ్ళిప్రస్తావన తెస్తే తను వేరే ఇంట్లోకి మారిపోతానని బెదిరించింది" అన్నాడు కృష్ణ.

"ఆమె కొలీగ్స్‌లో ఎవరినైనా ప్రేమించిందేమో కనుక్కున్నావా?"

"ఆ విషయం కూడా అడిగాము. తనకా ఆలోచనే లేదంది."

మధు కొంతసేపు మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత-

"ఆమెకు పెళ్ళిపై అంత విముఖత్వం కలగడానికి కారణం ఏమైవుంటుందంటావ్?" అని కృష్ణను అడిగాడు.

"ఆమె భర్త! అతనో సైకిక్ అని, భరణిని మానసికంగా చిత్రహింసలు పెట్టేవాడని మాకు చూచాయగా తెలుసు. అయితే భరణి మాతో ఆ విషయం చెప్పేది కాదు. తన సంతోషాన్ని అందరితో పంచుకుంటుంది గానీ, బాధల్ని మాత్రం గుండెలోనే దాచుకునే తత్వం ఆమెది. అతను పోయాక ఆమె అతన్ని తలచుకుని కన్నీళ్లు పెట్టుకోవడం చూళ్లేదు మేము. అతనితో పడిన బాధల వల్ల ఆమె మరో పెళ్ళికి సిద్ధంగా లేదనిపిస్తోంది."

నిజమేనన్నట్టు తలాడించి, "కొంతకాలం ఆమెతో పెళ్ళివిషయం మాట్లాడకండి. కాలక్రమేణా ఆమే తన నిర్ణయాన్ని మార్చుకోవచ్చు!" అన్నాడు మధు.

"కానీ, ప్రస్తుతం నేను ఆలోచించే విషయం ఒకటుంది" అన్నాడు కృష్ణ.

ఏమిటన్నట్లు చూశాడు మధు.

"మాకు పిల్లలు లేరు కాబట్టి భరణి రాత్రిపూట ఒంటరిగా గడపాల్సి వస్తోంది. వయసులో ఉన్న పిల్ల అలా విరాగినిలా కాలం గడుపుతూంటే నేనూ, నా భార్య సాంసారిక జీవితాన్ని అనుభవించలేకపోతున్నాము."

"అలా అనుకుంటే ఎలా? ఎవరి జీవితం వాళ్ళది. ఆ అమ్మాయికి ఆ విషయంలో ఆసక్తి ఉంటే పెళ్ళి వద్దనదు కదా?!"

"పెళ్ళి వద్దనడానికి కారణం వేరు. సెక్స్ అన్నది బయలాజికల్ నీడ్! మనిషికి ఆహారం ఎంత అవసరమో సెక్స్ కూడా అంతే అవసరం! భరణి వయసులో ఉన్న పిల్ల... ఆమెకు ఎన్నో కోరికలు ఉంటాయి. అరవై ఏళ్లు దాటిన దంపతులు కూడా రాత్రి కాగానే తమ గది తలుపులు వేసుకుంటూంటే... వయసులో ఉన్న పిల్ల తన కోరికల్ని ఎందుకు అణచుకోవాలి?" ఆవేశంగా అన్నాడు కృష్ణ.

"నువ్వన్నది నిజమే! కానీ, సంఘంలో బ్రతుకుతున్నాం కాబట్టి మనం కొన్ని కట్టుబాట్లు పాటించాలి. లేకుంటే నైతిక విలువలు పడిపోతాయి. దీనికి పరిష్కారం భరణి మళ్లీ పెళ్ళి చేసుకోవడమే!"

"ఆమెకు పెళ్ళి ఇష్టం లేదు. అందుకని తను అలా మోడువారిన జీవితం గడపవలసిందేనా? విచ్చలవిడితనాన్ని నేనూ సమర్ధించను. తను రోజుకో పురుషుడితో సుఖించమని అనను. తనకు నచ్చిన వ్యక్తితో పెళ్ళి ప్రస్తావన లేకుండా సుఖపడడం తప్పా?"

"తప్పు కాదు. కానీ, అది ఎంతవరకు సాధ్యమని అడుగుతున్నాను."

"ఎందుకు సాధ్యం కాదో చెప్పు?"

"బీ ప్రాక్టికల్ కృష్ణా! నువ్వు అనుకుంటున్న వ్యక్తి భరణిని అర్థంచేసుకునేవాడిగా ఉండాలి. ఎందుకంటే సెక్స్‌లో పరస్పర అవగాహన ఉంటేనే అది మధురమైన అనుభవం అవుతుంది. లేకుంటే ఏ అనుభూతీ ఉండదు. పైగా, ఆ వ్యక్తి మంచివాడుగా కూడా ఉండాలి. తర్వాత భరణిని బెదిరించడమో, బ్లాక్‌మెయిల్ చేయడమో అతను చేయకూడదు కాబట్టి! ఎయిడ్స్ మహమ్మారిలా వ్యాపిస్తున్న రోజులివి. అందువల్ల అతను ఆరోగ్యవంతుడిగా కూడా ఉండాలి. భరణి అందగత్తె అంటున్నావు కాబట్టి ఆమెకు నచ్చాలంటే అతను అందగాడు కూడా అయివుండాలి. ఇన్ని అర్హతలు ఉన్న వ్యక్తి దొరుకుతాడంటావా?"

"దొరికాడు మధూ!"

"ఎవరతను?" ఆశ్చర్యంగా అడిగాడు మధు.

"నువ్వే..!"

●

కాలింగ్ బెల్ చప్పుడు విని తలుపు తెరిచిన భరణి ఎదురుగా నిలబడివున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయింది.

నల్లని రింగుల జుట్టుతో, చురుకైన కళ్ళతో, గుబురు మీసాలతో అతను అందంగా కనిపించినందుకు కాదు ఆమె ఆశ్చర్యపోయింది- తను అతనికి ఎంతో కాలంగా తెలుసునన్నట్టు పలకరింపుగా నవ్వడం ఆమెను ఆశ్చర్యపరచింది. అంతకుమించి ఆహ్లాదపరచింది.

"కృష్ణ ఉన్నాడా?" మధు ఆమెని అడిగాడు.

"లేరండీ! బయటకు వెళ్లారు. మీరు..?"

"నేను కృష్ణ స్నేహితుణ్ణి! నా పేరు మధుసూదన్!"

"మీరు వస్తున్నట్లు మా బావగారు చెప్పారు. రండి... కూర్చోండి... ఆయనొచ్చే టైమైంది!"

మధు సోఫాలో కూర్చుంటూ ఆమెని పరిశీలనగా చూశాడు. ఆమె చాలా అందంగా వుంది. మంచి రంగు, చక్కటి అవయవ సౌష్టవం, పొడవుకు తగ్గ లావుతో ఆకర్షణీయంగా వుంది. నుదుట కనిపించీ కనిపించనట్టు నల్లటి చుక్క పెట్టుకుంది. 'ఆ చుక్కే లేకుంటే ఆమె అందంలో యాభైశాతం తగ్గిపోతుంది!' అనుకున్నాడు. ఆమెను చూస్తుంటే ఎంతో జాలి కలిగింది అతనికి.

ఆమె లోపలికి వెళ్లి కాసేపటితర్వాత కాఫీకప్పులతో వచ్చింది. ఇద్దరూ కాఫీ తాగారు.

"మిమ్మల్ని చూడగానే ఎక్కడో చూశాననిపించింది. మీ పేరు చెప్పాక గుర్తొచ్చారు. మిమ్మల్ని మా బావగారి ప్రక్కన చాలా ఫోటోల్లో చూశాను" అంది భరణి.

'అలాగా...' అన్నట్టు నవ్వాడు మధు.

కాసేపు ఇద్దరూ మౌనంగా గడిపారు.

"టీవీ చూస్తారా?" అని అడిగింది భరణి- ఏం మాట్లాడాలో తోచక.

"వద్దండీ... టీవీ చూడ్డం నాకు అంతగా ఇష్టం ఉండదు. ఏదైనా మంచి పుస్తకం వుంటే ఇవ్వండి. చదువుతూ వుంటాను."

"ఎటువంటి పుస్తకాలు కావాలి మీకు?"

"ఎన్ని రకాల పుస్తకాలు ఉన్నాయి మీ దగ్గర?" నవ్వుతూ అడిగాడు.

"చాలా ఉన్నాయి. షార్ట్ స్టోరీస్, నావల్స్, కామిక్స్, జోక్స్, పొయట్రీ..."

"లైబ్రరీ మెయిన్‌టెయిన్ చేస్తున్నారా?"

"లైబ్రరీ లాంటిదే... చూస్తారా?"

"ష్యూర్!" అంటూ లేచాడు మధు.

ఆమె తన గదిలోకి దారితీసింది. మధు ఆమెను అనుసరించాడు. గదిలో ఓ మూల రెండు ఐరన్ షెల్ఫ్‌ల నిండా పుస్తకాలున్నాయి. కథలు, కవితలు, నవలలు... ఇలా ప్రతి ప్రక్రియ విడివిడిగా, పద్ధతిగా అమర్చబడివున్నాయి.

"అద్భుతం! మీ అభిరుచి ఎంతో మెచ్చుకోదగ్గది. అసలు మీరు ఈ కాలం అమ్మాయేనా... అనిపిస్తోంది."

"నాకు పుస్తకాలంటే ప్రాణం. ఓ చక్రవర్తి అన్నాడట– 'ప్రపంచం మొత్తం ప్రళయం వచ్చి మునిగిపోయినా నేను పట్టించుకోను. నా లైబ్రరీకి మాత్రం ఎటువంటి హానీ కలగకుండా చూడు ప్రభూ! అని దేవుణ్ణి వేడుకుంటాను' అని! అలాంటి పరిస్థితి వస్తే నేను కూడా దేవుణ్ణి ఆ కోరికే కోరుతాను."

మధు ఆ పుస్తకాల్లోంచి 'జేమ్స్ హాడ్లీ ఛేజ్' రాసిన 'నాట్ సేఫ్ టు బి ఫ్రీ' పుస్తకాన్ని తీసుకుని, "మీకు అభ్యంతరం లేకపోతే ఈ పుస్తకం తీసుకెళ్లి చదివి మళ్లీ జాగ్రత్తగా మీకు తిరిగిస్తాను" అన్నాడు.

"తీసుకోండి. ఛేజ్ నావెల్స్ అంటే మీకిష్టమా?"

"అవును. ఛేజ్ నావెల్స్, ఓహెన్రీ కథలు నాకు చాలా ఇష్టం!" అంటూ ఆ గదిలో ఓ మూల గోడకు ఆనించివున్న క్యారమ్‌బోర్డ్ చూసి, "మీకు క్యారమ్స్ ఆడతారా?" అని అడిగాడు.

"అవును. క్యారమ్స్, చెస్ నాకు చాలా ఇష్టమైన ఆటలు."

"నేనూ ఇండోర్ గేమ్స్ అన్నీ ఆడతాను. ఇష్టపడతాను. కృష్ణ వచ్చేవరకూ క్యారమ్స్ ఆడదామా?"

ఆమె 'అలాగే...'నంటూ తలూపి, అక్కడే ఓ స్టూల్ మీద బోర్డు పెట్టి ఇరువైపులా కుర్చీలు వేసింది. ఆమెకు అలవాటయిన బోర్డు కాబట్టి మొదటి రెండు బోర్డులు తనే గెలిచింది. ఆ తర్వాత మధు ఆమెని గెలవనివ్వలేదు.

అరగంట ఆడాక మధు లేచాడు.

"నేను బయలుదేరతాను. కృష్ణ వస్తే నేను వచ్చివెళ్లినట్లు చెప్పండి. అతని కోసం వచ్చి మీ సమయం పాడుచేశాను."

"అదేం లేదు. నేనూ మీ కంపెనీ ఎంజాయ్ చేశాను..."

"ఓ.కే. గుడ్‌నైట్!" అంటూ సెలవు తీసుకున్నాడు మధు.

●

వారానికి రెండు రోజులు భరణి కోసం రావడం, ఆమె లైబ్రరీ నుంచి పుస్తకాలు తీసుకోవడం, చదివిన పుస్తకాలు తిరిగివ్వడం, ఆ పుస్తకాల గురించి చర్చించడం, క్యారమ్స్, చెస్ ఆడడం మధుకు అలవాటుగా మారింది. అతనికోసం ఎదురుచూడడం ఆమెకు అలవాటుగా మారింది.

మధు వ్యక్తిత్వం, తెలివితేటలు, చురుకుదనం ఆమెకెంతో నచ్చాయి. అతనితో వీలైనంత ఎక్కువ సమయం గడపడానికి ఉత్సాహం చూపించసాగింది.

మధుతో పరిచయమయ్యాక భరణి ఉత్సాహంగా ఉండడం గమనించాడు కృష్ణ. ఆ విషయం అతనికి ఆనందాన్నే ఇచ్చింది.

ఆరోజు సాయంత్రం మధు, భరణి క్యారమ్ బోర్డు ఆడుతున్నారు.

మధు ఆడే తీరు ఆమెని ఆశ్చర్యపరుస్తుంటుంది. అతితక్కువ వ్యవధిలో ప్లాన్ చేసి స్ట్రయిక్ చేస్తాడు. చాలా త్వరగా బోర్డు ముగిస్తాడు. మొదట్లో ఆమె చిత్తుగా ఓడిపోయేది. క్రమంగా అతనికి గట్టి పోటీ ఇవ్వసాగింది.

ఆరోజు ఆటలో భరణి గెలుపునకు చేరువలో ఉంది. మధు ఆమెని ఉత్సాహపరుస్తూ ఆడుతున్నాడు. మధు కొట్టిన స్ట్రోక్‌కి స్ట్రయికర్ కిందపడింది. దాన్ని తీయడానికి వంగింది భరణి.

పలుచని ఆమె చీరకొంగు కిందకు జారింది. అటువైపు చూసిన మధు కళ్ళు చెదిరిపోయాయి. బిగువు సడలని అందాలు బిగుతు రవికలో తాము పడే అవస్థని చూపాయి. ఏ క్షణమైనా తాము స్వేచ్ఛని ప్రకటించబోతున్నామని హెచ్చరికలు పంపినట్టు ఆమె రవిక రెండు హుక్స్ తెగిపోయివున్నాయి.

ఆమె స్ట్రయికర్ బోర్డు మీద పెట్టి, పైట సరిచేసుకుని చూసింది...

ఎదురుగా మధు లేడు.

ఆశ్చర్యంగా చుట్టూ చూస్తున్న ఆమె భుజాలపై అతని చేతులు మృదువుగా పడ్డాయి. తమకంతో కళ్ళు మూసుకుందామె. అతని చేతులు కిందకు జారాయి. ఆమె ఉలిక్కిపడింది. అతన్ని వారించాలని అనుకుంది. అయితే ఆమె మనసు చెప్పిన మాట శరీరం వినలేదు. అతని కండబలం ఆమె గుండెబలాన్ని పరీక్షిస్తోంది. ఆమె అలాగే లేచి నిలబడింది. మధువైపు తిరిగి అతన్ని గట్టిగా కౌగిలించుకుంది.

అక్కడ్నుంచి ఆమె మంచం మీదికి చేరారిద్దరూ.

పావుగంట సమరం తర్వాత అతని నుంచి విడివడి కళ్ళు మూసుకుని పడుకుంది తృప్తిగా.

మధు ఆమెతో "ఈ గేమ్ బాగుందా?" అని అడిగాడు.

ఆమె తన మృదువైన చేతుల్తో మొహాన్ని కప్పుకుంది సిగ్గుతో.

మధు ఆమె చేతుల్ని మొహం మీద నుంచి తీస్తూ "చెప్పండి..." అన్నాడు.

"యు ఆర్ గుడ్ ఇన్ దిస్ ఇండోర్ గేమ్ ఆల్సో!" అంది భరణి.

●

"కృష్ణా! నువ్వూ, శాంతి తిరుమల వెళ్లినరోజు నేను మీ ఇంటికి వచ్చాను. భరణి విషయంలో నువ్వు కోరుకున్నది జరిగింది ఆరోజు!" అన్నాడు మధు.

"థాంక్యూ మధూ... థాంక్యూ!" ఆనందంగా అన్నాడు కృష్ణ.

"నేను భరణికి దగ్గర కావడానికి నీ వంతు సహాయం చేశావు. ఆమె అభిరుచుల గురించి ముందే నాకు చెప్పావు. పదే పదే మాకు ఏకాంతం కల్పించావు. అలాగే భరణి శృంగార జీవితానికి దూరం కాకూడదన్న నీ వాదనను నేను సమర్థించాను. కాని, 'నేను చేస్తున్న పని అనైతికం కాదు' అన్న నీ పాయింట్‌ని మాత్రం సమర్థించలేకపోయాను. దాని గురించి మనసులో ఎంతో సంఘర్షణకు గురయ్యాను. ఆలోచించి, ఓ నిర్ణయానికి వచ్చాను. నేను భరణిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను."

నమ్మలేనట్టు చూశాడు కృష్ణ.

"మరి, పెళ్ళికి ముందు సెక్స్ అనైతికత కాదా? అని నువ్వు అడగొచ్చు. ఈ కొద్దిరోజుల సాంగత్యంలో భరణి తన భర్త గురించి కొన్ని విషయాలు చెప్పింది. అతనో శాడిస్ట్... ముఖ్యంగా సెక్స్ విషయంలో! అందుకే వసంత రాత్రి కావలసిన ప్రతీ రాత్రి ఆమెకు కాళరాత్రే అయ్యింది. మధురమైన అనుభవాలుగా మిగలాల్సిన శృంగారం, అతని పైశాచిక ఆనందం కోసం ఆమెను శారీరకంగా పెట్టిన బాధల వల్ల ఆమెకు పీడకలలుగా నిలచిపోయాయి. అందుకే ఆమె పెళ్ళంటేనే భయపడుతోంది. ఆమెలో ఆ భయం పోవడానికే నేను పెళ్ళికి ముందే ఆమెతో సెక్స్‌లో పాల్గొన్నాను. 'రాక్షస లీల'ను మాత్రమే చవిచూసిన ఆమెకు 'రాసలీల' అంటే ఏమిటో తెలియజెప్పాను. అందుకే ఆమె నాతో పెళ్ళికి తన అంగీకారం తెలిపింది."

కృష్ణ ఆనందానికి హద్దుల్లేవు.

"నా మనసుని తొలిచేస్తున్న ఓ పెద్ద సమస్యకు పరిష్కారం చూపావు. థాంక్యూ మధూ!" అంటూ మధు చేయందుకుని ఊపేశాడు.

'ఆంధ్రభూమి' వారపత్రిక ... 15 డిసెంబర్' 2005